# ప్రజల మనిషి పాకా రమేష్‌కు
# ఉత్తమ ప్రజా సేవకుడు అవార్డు

### - ప్రజా సేవలో ఆదర్శప్రాయమైన కృషికి గుర్తింపు




**తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి(పి.సైదులు),జూన్22:** తెలంగాణ రాష్ట్ర వైద్య,ఆరోగ్య శాఖ మంత్రి కార్యాలయంలో ఓఎస్డి (ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ)గా కీలక బాధ్యతలు నిర్వహిస్తున్న పాకా రమేష్ కు "ఐకాన్ ఆఫ్ ఎక్సలెన్స్ అవార్డ్స్ 2025" వేడుకలో "ఉత్తమ ప్రజా సేవకుడు" (బెస్ట్ హ్యూమనిటేరియన్ పబ్లిక్ సర్వెంట్) అవార్డును అందుకున్నారు. హైదరాబాదులోని మాదాపూర్ లోని దాస్పల్ల హెూటల్లో జరిగిన ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక శాఖ సారథి జి.వెన్నెల గద్దర్,తెలంగాణ ఫిలిం ఛాంబర్ చైర్మన్ పి.రామకృష్ణ గౌడ్ ల చేతుల మీదుగా ఆయన ఈ పురస్కారాన్ని స్వీకరించారు.తెలంగాణ తహసీల్దార్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శిగా కూడా సేవలందిస్తున్న పాకా రమేష్, తన వృత్తిని కేవలం ఒక ఉద్యోగంగా కాకుండా, ప్రజలకు సేవ చేసే అవకాశంగా భావిస్తారు.నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ, వారి సమస్యలను పరిష్కరించడంలో అంకితభావం, పట్టుదల, సహకారం అందిస్తున్న ఆయన సేవలను వక్తలు ఈ సందర్భంగా ప్రశంసించారు.ఆయనను కలవడానికి వచ్చే ప్రతి వ్యక్తిని దైవంగా భావిస్తూ, వారి సమస్యలను పరిష్కరించడంలో ఆయన చూపే శ్రద్ధ విశేషమైనదిగా కొనియాడారు.ఈ అవార్డు ఆయన నిస్వార్థ సేవకు, మానవీయ విలువల పట్ల ఆయనకున్న అంకితభావానికి నిదర్శనమని వక్తలు అభిప్రాయ పడ్డారు. ఈ సేవా దృక్పథం ఆయన ఉద్యోగంలో సామాజిక బాధ్యతను ప్రోత్సహిస్తోంది. అధికార నిబద్ధతతో పాటు మానవీయ విలువలకు ప్రాధాన్యతనిచ్చే ఆయన విధానం ప్రజాసేవలో స్ఫూర్తి దాయకం.ఈ పురస్కారం ఆయన ప్రజా ప్రయోజనానికి ఆయన అంకిత భావ సేవలకు గౌరవం దక్కింది అని వారు పేర్కొన్నారు.పలువురు ఉద్యోగ సంఘాల జెఏసి (జాయింట్ యాక్షన్ కమిటీ) నేతలు, తెలంగాణ రెవెన్యూ ఉద్యోగ సంఘాల జెఏసి నేతలు పాకా రమేష్ కు అభినందనలు తెలిపారు.ఈ పురస్కారం మరింత మందికి ఉపయోగపడే అవకాశాలను ఆయనకు కల్పించాలని వారు ఆకాక్షించారు.పాకా రమేష్ సేవలు భవిష్యత్ లో కూడా నిరాటంకంగా కొనసాగాలని, ప్రజలకు మరింత చేరువ కావాలని పలువురు ఆకాంక్షించారు.

# కాంగ్రెస్ హామీలపై తెలంగాణ ఉద్యమకారుల నిరసన



- **ఆత్మగౌరవ పోరాటానికి పిలుపు**
- **పోరాడితే పోయేది లేదని..బానిస సంకెళ్లు తప్ప**
- **ఉద్యమకారుల పట్ల నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తూ రాష్ట్ర ప్రభుత్వం**
- **మహబూబాబాద్ జిల్లా తెలంగాణ ఉద్యమకారుల ఫోరం అధ్యక్షులు ముద్దసాని వెంకటేశ్వర్లు**

**తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి(పి.సైదులు),జూన్22:** తెలంగాణ ఉద్యమకారులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలపై మహబూబాబాద్ జిల్లాలోని ఉద్యమకారులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. తెలంగాణ ఇస్తానన్న కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఉద్యమకారులకు 250 గజాల స్థలం, నెలకు రూ.25వేల పెన్షన్, హెల్త్ కార్డులు,ఇతరత్రా అన్ని విధాలుగా ఆదుకునేందుకు ఒక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామని ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను విస్మరించిందని మహబూబాబాద్ జిల్లా తెలంగాణ ఉద్యమకారుల ఫోరం అధ్యక్షులు ముద్దసాని వెంకటేశ్వర్లు ఆరోపించారు. మహబూబాబాద్ జిల్లా తెలంగాణ ఉద్యమకారుల ఫోరం అధ్యక్షులు ముద్దసాని వెంకటేశ్వర్లు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేస్తూ...కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యమకారులను కించపరిచే విధంగా, వారి ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే విధంగా వ్యవహరిస్తోందని తీవ్రంగా విమర్శించారు.నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తూ, ఉద్యమకారుల పట్ల ఎలాంటి బాధ్యత లేకుండా ప్రభుత్వం ప్రవర్తిస్తోందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.ఈ నేపథ్యంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం నాయకులు, నాయకురాళ్లు అందరూ కలిసి ఈ రోజు నుండి వినూత్న రీతిలో నిరసన తెలపాలని నిర్ణయించారు.ఈ నిరసనలో భాగంగా అందరూ ప్రెస్ మీట్‌ల ద్వారా తమ నిరసనను వ్యక్తం చేయాలని ముద్దసాని వెంకటేశ్వర్లు మహబూబాబాద్ జిల్లాలోని అన్ని మండలాల అధ్యక్షులకు,రాష్ట్ర నాయకులకు, జిల్లా నాయకులకు విజ్ఞప్తి చేశారు.ఉద్యమకారులందరూ మన హక్కుల సాధనకై తప్పనిసరిగా పోరాడాలనీ పేర్కొన్నారు.పోరాడితే పోయేది లేదని, బానిస సంకెళ్లు తప్ప....పోరాడితే వచ్చేది మనదే విజయం" అని ఆయన పిలుపునిచ్చారు.ఈ విషయాన్ని అందరికీ తెలియజేసి, ప్రెస్ మీట్‌ల ద్వారా ఉద్యమాన్ని కొనసాగించాలని ఆయన కోరారు.